ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 30 మార్చి 2024



భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

క్రైస్తవులు 'గుడ్ ఫ్రైడే'ను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, వీధుల్లో ఊరేంగిపు జరిపారు. ప్రధానంగా రోమన్ సైనికులు ఏసుక్రీస్తును బంధించడం, తలపై ముళ్ల కిరీటం పెట్టడం, వీధుల్లో శిలువను మోయిస్తూ కొరడాలతో కొట్టడం, శిలువ వేయడం వంటి సన్నివేశాలను పలుచోట్ల కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.



తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగజగదీశ్వరరావు, పాల్గొన్న నాయకులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ అవశ్యకత, , తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం, పరిపాలనలో నూతన ఒరవడి, మహిళలు, బీసీలకు రాజకీయ ప్రాధాన్యం గురించి సీనియర్ నాయకులు వివరించారు. పలుచోట్ల జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు.



గుడ్ ఫ్రైడే సందర్భంగా చోడవరంలో ఏసుక్రీస్తు వేషధారిచే శిలువను మోయిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



బస్సు దిగుతున్న ధోనీ

ఐపీఎల్ సందడి

విశాఖ చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు

- ఇరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రేపు
- నేడు నెట్ ప్రాక్టీస్

- 7లో

ఒక్క అవకాశం ఇవ్వండి

- జిల్లాను అభివృద్ధి చేస్తా..
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొత్త పరిశ్రమలు
- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎస్ఈజడ్‌లు
- వైసీపీ ప్రభుత్వం మూసివేయించిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాను
- అన్ని రంగాల్లో ప్రగతి చూపిస్తాను
- సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని డిప్యూటీ సీఎం... ఎంపీగా గెలిపిస్తే ఏం చేస్తారని ప్రశ్న
- ఎంపీ అభ్యర్థిగా తొలిసారి జిల్లాకు రాక
- ఘనస్వాగతం పలికిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

అనకాపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'అనకాపల్లి ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడింది. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఎంపీగా గెలిచి రావాలని బీజేపీ అధిష్ఠానం టికెట్ ఇచ్చి ఆదేశిస్తే వచ్చాను. లోక్‌సభ సభ్యునిగా ఎన్నుకొంటే అనకాపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాను' అని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూటమి తరపున పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ అన్నారు. ఎంపీ అభ్యర్థిగా రమేశ్ పేరును బీజేపీ అధిష్ఠానం ప్రకటించిన తరువాత ఆయన శుక్రవారం తొలిసారిగా అనకాపల్లి వచ్చారు. జిల్లా సరిహద్దులోని లంకెలపాలెం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అనకాపల్లిలోని (నాగులాపల్లి రోడ్డు) జేఎంజే స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్వాగత సభలో ఆయన మాట్లాడారు. ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించిన వెంటనే ఈ ప్రాంత ... మిగతా 6వ పేజీలో



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న సీఎం రమేశ్, కుటుంబ సభ్యులు

గోధుమ పిండి కట్

పౌరసరఫరాల గోదాముకు చేరని సరుకు

- బియ్యం, పంచదార, రాగి పిండి మాత్రమే పంపిణీ
- నాలుగు నెలల క్రితమే ఆగిన కందిపప్పు సరఫరా



పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పౌరసరఫరాల గోదాము

నర్సీపట్నం, మార్చి 29:

ఏప్రిల్ రేషన్ సరకుల్లో గోధుమ పిండి కోత పడింది. నర్సీపట్నంలోని పౌరసరఫరాల గోదాములో బియ్యం, పంచదార, రాగి పిండి మాత్రమే డీలర్లుకు సరఫరా చేస్తున్నారు. దీంతో వచ్చే గోధుమ పిండి పంపిణీ లేనట్టే! కాగా కందిపప్పు సరఫరాను నాలుగు నెలల క్రితమే ఆపేశారు.

నర్సీపట్నంలోని పౌరసరఫరాల గోదాము పరిధిలో గొలుగొండ మండలంలో 18,509, నర్సీపట్నంలో 26,421 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం 84 రేషన్ డిపోలు ఉన్నాయి. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కార్డుదారులకు వీధుల్లో సరకులు పంపిణీ చేస్తున్నారు. గతంలో బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పండి పంపిణీ చేసేవారు. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. అయితే మార్చి నుంచి కొత్తగా ఒక కిలో రాగి పిండిని కూడా ఇస్తున్నారు. ఏప్రిల్ నెలలో పంపిణీ చేయాల్సిన వాటిలో గోధుమ పిండి మినహా మిగిలిన సరకులు ఇప్పటికే గోదాముకు చేరాయి. మరో రెండు రోజుల్లో రేషన్ పంపిణీ చేయాల్సి వుండడంతో ఏప్రిల్‌లో గోధుమ పిండి పంపిణీ లేనట్టేనని అధికారులు చెబుతున్నారు. రేషన్ డీలర్లు బియ్యం, పంచదార, రాగి పిండిని మాత్రమే విడిపిస్తున్నారు. బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. రాగి పిండి కావాల్సిన వారు ఒక కిలో బియ్యం తగ్గించుకోవాలి. అంతేకాక డీలర్‌కు రూ.11 చెల్లించాలి. కాగా గోధుమ పిండికి కార్డుదారుల నుంచి ఆదరణ బాగానే వున్నప్పటికీ ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంతవరకు సరకు రాలేదని అధికారులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో గోధుమ పిండి కిలో ప్యాకెట్ (బ్రాండెడ్) రూ.60, లూజు అయితే రూ.40కి అమ్ముతున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు రూ.16కే అందిస్తున్నారు. ఇప్పటికే కందిపప్పు సరఫరా నిలిచిపోగా, ఇప్పుడు గోధుమ పిండి సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో ఈ రెండు సరకులను కార్డుదారులు అధిక ధర చెల్లించి ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాగి పిండి విడిపించడానికి డీలర్లు విముఖత

గొలుగొండ: బియ్యం ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం.. కిలో రాగి పిండికి రూ.11 వసూలు చేస్తున్నది. మండలంలో 18,509 రేషన్ కార్డులు వున్నాయి ఈ మేరకు రేషన్ డీలర్లు ఒక్కో కార్డుకు కిలో చొప్పున రాగి పిండికి ముందుగానే డీడీలు తీయాలి. కానీ చాలా మంది డీలర్లు ఏప్రిల్‌కు సంబంధించి రాగి పిండికి డీడీలు తీయలేదు. మార్చి నెలలో విడుదల చేసిన రాగి పిండిలో చాలా వరకు మిగిలిపోయిందని, అందువల్ల ఏప్రిల్ నెలకు రాగి పిండి అవసరం లేదని డీలర్లు చెప్పారు. కానీ పౌరసరఫరాల అధికారులు పట్టించుకోలేదు. రాగి పిండికి డీలర్లు డీడీలు తీయనప్పటికీ డీలర్ల కమీషన్ డబ్బులు తగ్గించి ఆ మేరకు రాగి పిండిని రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అధికారుల తీరుపై రేషన్ డీలర్లు మండిపడుతున్నారు.

అచ్యుతాపురంలో పట్టపగలు చోరీ

- పది తులాల బంగారం, రూ.75 వేల నగదు అపహరణ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

అచ్యుతాపురం, మార్చి 29: అచ్యుతాపురంలో పట్టపగలు చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి పది తులాల బంగారం, రూ.75 వేల నగదు అపహరించుకుపోయారు. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అచ్యుతాపురం చాకలి వీధిలో అల్లు శ్రీను భార్య, పిల్లలతో నివాసం వుంటున్నారు. శ్రీను ఒక హోటల్‌లో సప్లయర్‌గా పని చేస్తుండగా, భార్య అమ్మాజీ భవన నిర్మాణ కార్మికురాలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహమైంది. రెండో అమ్మాయి ఇంటర్ చదువుతున్నది. శుక్రవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పనులకు వెళ్లిపోయారు. ఇంట్లోనే వున్న చిన్న కుమార్తె.. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి, తాళం చెవిని రహస్య ప్రదేశంలో పెట్టి మోసయ్యపేట లోని కొత్తూరులో ఉంటున్న తన సోదరుడు (పిన్ని కుమారుడు) ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తరువాత ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటి తాళం తీసి వుంది. తలుపుతీసి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. వారు ఇంటికి చేరుకుని బీరువాలో పరిశీలించారు. పది తులాల బంగారం, రూ.75 వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు వెళ్లి పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

లంకెలపాలెం కూడలిలో బొగ్గు లారీ బీభత్సం

సిగ్నల్ లైట్స్ వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిల్



ప్రమాదానికి కారణమైన బొగ్గు లారీ



కారుపైకి ఎక్కిన ట్రాక్టర్

- ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకుపోయిన లారీ
- రెండు కార్లు, ఆటో, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం

లంకెలపాలెం, మార్చి 29:

జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బీభత్సం సృష్టించింది. బ్రేకులు ఫెయిలవ్వడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకుపోయింది. దీంతో రెండు కార్లు, ఆటో, ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



అగనంపూడి ఆస్పత్రిలో క్షతగాత్రుడు

జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో గాజువాక వైపు నుంచి వచ్చే వాహనాలకు రెడ్ సిగ్నల్ పడింది. ఈ క్రమంలో ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.13
సహరి (ఆది)	4.39

భీమిలిపై వీడిన ఉత్కంఠ

టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావే

- ఎట్టకేలకు ప్రకటించిన అధిష్ఠానం
- పార్టీ శ్రేణుల్లో హర్షం



విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సీనియర్ నాయకులు గంటా శ్రీనివాసరావు ఈసారి భీమిలి నుంచి పోటీ చేయనున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం శుక్రవారం ఖరారుచేసింది. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు రానున్న ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేయాలని భావించారు. ఆ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసి, అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే ఈసారి విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అక్కడ విజయం సాధిస్తే మంచి పేరు వస్తుందని వెళ్లాలని ఆదేశించారు. అయితే చీపురుపల్లి తనకు దూరం అవుతుందని, వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటుందని గంటా తన మనసులో మాట వెల్లడించారు.

అనేక తర్జనభర్జనల అనంతరం

గంటాను చీపురుపల్లి వెళ్లాల్సిందిగా సూచించిన అధిష్ఠానం భీమిలి నియోజకవర్గానికి పలువురి పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు ... మిగతా 7వ పేజీలో

ఇద్దరు వలంటీర్లపై కేసులు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 29: ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ సమావేశాలకు హాజరైన ఇద్దరు వార్డు సచివాలయాల వలంటీర్లపై శుక్రవారం కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. 22వ వార్డు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న కె.శివకృష్ణ అనే వలంటీర్ 26వ తేదీన వైసీపీ సమావేశంలో పాల్గొని ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్టు సచివాలయం అడ్మిన్ సెక్రటరీ రెడ్డి రామచరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ నెల 24వ తేదీన కోట్నీవీధిలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచార సమావేశంలో 10వ వార్డు సచివాలయం పరిధిలోని గొల్లవీధి వలంటీర్ ఆలం శివరామప్రసాద్ పాల్గొన్నాడు. ఇతనిపైనా వార్డు అడ్మిన్ సెక్రటరీ కె.మంగఅప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

విశాఖలో పాలిటెక్నిక్ విద్యార్థిని బలవన్మరణం

- లైంగిక వేధింపులే కారణమంటూ తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా మెసేజ్
- గురువే కీచకుడిగా మారిన వైనం

వివరాలు మెయిన్ 3లో

వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి లేదు

» జనసేన అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కశింకోట, మార్చి 29 : వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలే తప్ప అభివృద్ధి శూన్యమని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కశింకోట, పరవాడపాలెం, తేగాడ గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ తొలగించిన పేదల పించన్లను పునరుద్ధరిస్తామన్నారు. గాజు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, పొన్నగంటి అప్పారావు, బలిజ మంగ, బలిజ మునినినాయుడు, నిమ్మదల సన్యాసినాయుడు, వేగి గోపీకృష్ణ, రాము, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు కొణతాల స్వాగతం

» వెయ్యి బైక్‌లతో ర్యాలీ


బుల్లెట్‌పై కార్యకర్తలతోపాటు వెళుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 29 : భారతీయ జనతా పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారిగా అనకాపల్లికి వచ్చిన సీఎం రమేశ్‌కు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వెయ్యికి పైగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లి అపూర్వ స్వాగతం పలికారు. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయాయి. కొణతాల రామకృష్ణ నేరుగా బుల్లెట్ నడిపి కార్యకర్తలతో వెళ్లారు. అనంతరం జేఎంజే స్కూలు ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కోరిబిల్లి హరి, ఎం. సంతోష్ పాల్గొన్నారు.

మునగపాకలో.. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు మద్దతుగా శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసలి నాయుడు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, మళ్ల వరహా నరసింగరావు, దొడ్డి రమేశ్, మళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక


సీఎం రమేష్ సమక్షంలో బీజేపీలో చేరిన కార్యకర్తలు

కొత్తూరు, మార్చి 29 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో పలువురు శుక్రవారం చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బీజేపీ కార్యాలయంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో చేరిన వీరంతా లక్ష్మీదేవిపేట ప్రాంతానికి చెందిన వారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొణతాల సూర్య సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ మీటర్లపై తొలగించని జగన్ స్టిక్కర్లు

కశింకోట, మార్చి 29 : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్టిక్కర్లతో ఉన్న ఉచిత కరెంటు మీటర్లు బిగించడం తగదని సర్వేజన ఐక్యవేదిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు కోరిబిల్లి హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంలో భాగంగా కొత్త విద్యుత్ మీటర్లకు జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లు బిగించడం ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనేనన్నారు. తక్షణమే జిల్లా ఎన్నికల అధికారులు స్పందించి స్టిక్కర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.


వెదురుపర్తి పొలాల్లో జగన్ ఫొటో ఉన్న స్టిక్కరుతో బిగించిన కరెంటు మీటరు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


అనకాపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొణతాల రామకృష్ణ, పీలా గోవింద


డీవీఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 29 : పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రింగు రోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పెన్నిధి ఎన్టీ రామారావు అని అన్నారు. సినీరంగంలోను, రాజకీయ రంగంలోనూ సేవలందించిన ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, నాయకులు కోట్ని రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని బాలాజీ, కొణతాల రత్నకుమారి, బొడ్డేడ మురళీ, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ జంక్షన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, సూరే సతీష్, పోలారపు త్రినాథ్, భాను పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్రి దివాకర్‌రావు, పల్లా శ్రీనివాసరావు, పీఎస్ అప్పారావు, శివరామరాజు, కాళ్ల ఈశ్వరఅప్పారావు, బొడ్డేడ శంకరరావు, కోటిపల్లి జేజిబాబు, కోటిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎలమంచిలిలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలిలో.. పట్టణంలో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతుడు ఎన్టీ రామారావు అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాష్ట్ర ప్రతినిధి రాజాన నారాయణమ్మ, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బొద్దపు శ్రీను, మాజీ కౌన్సిలర్ పందూరి శ్రీను, నేతలు సాగర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత నివాసం పార్టీ జెండాను ఆ పార్టీ నాయకుడు లాలం కాశీనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు కూకరాజు, వైబోయిన రమణ, చిట్టిబాబు, అల్లు నర్సింహమూర్తి, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

మునగపాకలో.. టీడీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగులాపల్లి కార్యాలయంలో పార్టీ జెండాను ఆయన ఎగరవేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


ఎలమంచిలిలో గుడ్ ఫ్రైడే సన్నివేశాల్లో భాగంగా శిలువ మోస్తున్న క్రీస్తు వేషధారిణి

పాయకరావుపేట, మార్చి 29: పట్టణంలో గుడ్ ఫ్రై డేను క్రైస్తవులు శుక్రవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్లు జయప్రసాద్, మరియన్న, జాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం శిలువ మోస్తున్న ఏసుప్రభు వేషధారిని సైనికులు పట్టణంలోని మెయిన్ రోడ్డు, లింగాలకాలనీ మీదుగా జాతీయ రహదారి అవతల ఉన్న కల్వరి కొండపైకి తీసుకెళుతున్న దృశ్యాన్ని పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

కోటవురట్లలో.. మండలంలోని పందూరు, గొట్టివాడ, కైలాసపట్నం, జల్లూరు, రాట్నాలపాలెం, పాములవాక, లింగాపురం, యండపల్లి గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోటవురట్ల కేకేబీ చర్చి, బేతెస ప్రార్థన మందిరంలో శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్స్ పీఆర్ బాబు, మోషే, పెద్దలు, ఆర్.ప్రసన్నకుమార్,ఎం ఆనందరాజ్, బి. యేసుదాసు, ఎస్. సాందీప్‌రాజ్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. పట్టణంలోని వందేళ్ల పైబడిన ఆంధ్రా సెంటినరీ బాప్టిస్టు చర్చితోపాటు ఇతర చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలో తులసీనగర్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా సెయింట్ మేరీస్ స్కూల్ వరకు ఆర్‌సీఎం కేథలిక్ సంఘం ఆధ్వర్యంలో ఏసు క్రీస్తుకు రాజభటులు శిలువ వేసి తీసుకువెళుతున్న దృశ్యం భక్తుల కంటతడి పెట్టించింది. ఈ సన్నివేశాల్లో క్రీస్తుగా ఎస్.మోహన్, పిలాతుగా జి.అర్లిప్ప తదితరులు వేషధారణలు వేశారు. కార్యక్రమంలో ఫాదర్‌లు లూకాస్, నాయుడు, సెయింట్ మేరీస్ స్కూలు కరస్పాండెంట్ సిస్టర్ కృప, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఏటికొప్పాక, పీఎస్ఆర్‌పేట, తదితర గ్రామాల్లోనూ గుడ్ ఫ్రైడేను జరుపుకున్నారు. కార్యక్రమంలో చర్చి సంఘ అధ్యక్షులు మోజెస్, ఉపాధ్యక్షుడు ప్రకాశరావు, కార్యదర్శి ఆనందరాజు, ప్రతినిధులు సురేష్, పీవీ. రమణ, రాజేష్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అప్పన్నపాలెం, గొరపూడి, వెల్చూరు, పంచదార్ల, నారాయణపురం, దిమిలి, వెంకటాపురం, ఎస్ఇజడ్, రాజుకోడూరు, సంతపాలెం, వెంకయ్యపాలెం, లాలంకోడూరు, కొత్తపట్నం, వాడనర్సాపురం, కొత్తపేట, నారాయణపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్‌లు సుధీర్‌కుమార్, జాషువా రాయ్, జేమ్స్, సైమన్ పీటర్, జి.అప్పారావు, ఐజాక్ ఏసు సందేశాన్ని ఇచ్చారు.

సబ్బవరంలో.. మండలంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కేథలిక్ చర్చిలో ప్రీస్ట్ థామస్ పులికల్, దేవీపురం డాన్ బాస్కో ఫాదర్ కల్యాణ్ కేథలిక్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలోఏ బ్రిటన్ సిస్టర్స్ ఆలీసు, సిస్టర్ సునీత, విజయప్రియ, ఫ్లోర, ప్యారిష్ కౌన్సిల్ సభ్యులు ఆడారి నాగరాజు, సుకరాజు, పాలవెల్లి, గణేష్, బొబ్బిలి అప్పారావు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజుకోడూరు రోడ్డుపై నరకయాతన

» రాకపోకలు సాగించేందుకు ప్రయాణికుల అవస్థలు
» మరమ్మతులు చేపట్టని అధికారులు, పాలకులు

రాంబిల్లి, మార్చి 29 : మండలంలోని రాజుకోడూరు నుంచి పంచదార్ల వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరి, రాకపోకలు చేస్తున్నవారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు గోతులమయమై, రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణాలు సాగించే ప్రజలు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తుందని వాహనదారులు, పాదాచారులు చెబుతున్నారు. కనీసం నడవడానికి కూడా వీలు లేని పరిస్థితిలో ఈ రోడ్డు దుస్థితి ఉందని వారంటున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. అధికారులకు, వైసీపీ పాలకులకు విన్నవించుకున్నా ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులైనా చేపట్టాలని వారు కోరుతున్నారు.


రాజుకోడూరు నుంచి పంచదార్ల వెళ్లే రోడ్డులో అధ్వాన రోడ్డు దుస్థితి

లంకెలపాలెం కూడలిలో బొగ్గు లారీ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి వైపు వెళుతున్న రెండు కార్లు, ఒక ఆటో, ఒక ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలు ఆగివున్నాయి. ఇదే సమయంలో గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో వేగంగా వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్పటికే సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను, ఎడమ వైపు వున్న కారును బలంగా ఢీకొన్నది. ఈ వాహనాలు.. ముందున్న మిగిలిన వాహనాలను ఢీకొన్నాయి. కారుపైకి ట్రాక్టర్ దూసుకుపోయింది. లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. డివైడర్ రెయిలింగ్ ధ్వంసం కావడంతోపాటు సెంట్రల్ లైటింగ్ స్తంభం కూలిపోయింది. ఈ ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్‌తోపాటు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.సంతోషి, కె.వెంకటరమణ, పాతగాజువాకకు చెందిన బి.శరణ్య అగనంపూడికి చెందిన పల్లా శ్రీను జి.హర్ష, జి.కొండయ్య డి.శ్రీనివాసరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్, డి.శ్రీని వాసరాజు, కె.వెంకటరమణల పరిస్థితి ఆందోళనకరంగా వుందని పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి తొలగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పరవాడ పోలీసులు తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

... 5వ పేజీ తరువాయి

వివరాలు సేకరించానని రమేశ్ చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఎంతోమంది యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించానని, గతంలో బీజేపీ-టీడీపీ కూటమి పాలనలో జిల్లాకు కొత్తగా పలు పరిశ్రమలు వచ్చాయని, జగన్ పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆయన ఆరోపించారు. తాను స్థానికేతరుడంటూ ప్రత్యర్థి పార్టీ వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఉండి కనీసం సొంత అసెంబ్లీ నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేసుకోలేని బూడి ముత్యాలనాయుడు (వైసీపీ ఎంపీ అభ్యర్థి) వల్ల జిల్లా అభివృద్ధి చెందుతుందా, లేకపోతే తాను ఎంపీగా ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందా అనేది తనపై విమర్శలు చేసేవారు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి ఏ రోజైనా సీఎం జగన్‌ను కోరారా అని రమేశ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు ఆయన శాఖ(పంచాయతీరాజ్) ద్వారా గ్రామ పంచాయతీలకు వస్తే.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలకు మళ్లించుకున్నా బూడి ముత్యాలనాయుడు పట్టించుకోలేదని ఆరోపించారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనారిటీలు అంటూ పదేపదే చెప్పుకొనే సీఎం జగన్.. వైసీపీకి చెందిన బీసీ నాయకులను విజయసాయిరెడ్డి, వైవీసుబ్బారెడ్డిలకు ఊడిగం చేసే వారిగా మార్చేశారని మండిపడ్డారు. జిల్లా అభివృద్ధిని గాలికొదిలేసిన బూడి.. ఇప్పుడు ఎంపీగా గెలిపించాలని ఓటర్లను ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు అనకాపల్లి నుంచి చోడవరం కారులో వెళితే సుమారు గంటన్నర సమయం పట్టిందన్నారు.

ఎంపీగా గెలిపిస్తే అందుబాటులో ఉంటా

అనకాపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, జిల్లా అభివృద్ధిలో భాగస్వామినవుతానని సీఎం రమేశ్ చెప్పారు. వైసీపీ పాలకులు మూసివేయించిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పిస్తానని, చెరకు పంటకు గిట్టుబాటు ధర అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానని సీఎం రమేశ్ చెప్పారు. అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా ఎస్ఈజడ్‌లను ఏర్పాటు చేయించి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే చర్యలు చేపడతానన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల ఆధునికీకరణకు కృషి చేస్తానన్నారు.

మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి సీహెచ్.అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన సీఎం జగన్.. ఇప్పుడు బస్సు యాత్ర పేరుతో జనం వద్దకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడని, పోలవరం ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో 72 శాతం పూర్తిచేయగా, వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండు శాతం పనులు కూడా జరగలేదన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులు అన్నివిధాలా మోసపోయారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి అసెంబ్లీ అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్‌రాజు, వంగలపూడి అనిత, సుందరపు విజయ్‌కుమార్, పైలా ప్రసాదరావు, , ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, రాయపురెడ్డి కృష్ణ, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మసాలా ఘుమఘుమలు

» ఉపమాక జాతరలో రికార్డు స్థాయిలో అమ్మకాలు
» కిక్కిరిసిపోయిన దుకాణాలు
» రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం


సరుకులు కొని ఇళ్లకు తీసుకెళ్తున్న యాత్రికులు

నక్కపల్లి, మార్చి 29: ఉపమాక జాతరలో మసాలా ఘుమఘుమలాడుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాది మంది యాత్రికులు జాతరలో సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేశారు. దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. ధరల్లో పెద్ద వ్యత్యాసం లేనప్పటికీ స్వామివారి సన్నిధి వద్ద కొనాలన్న సెంటిమెంట్ భక్తుల్లో వుంది. రోజూ రూ.లక్షల్లోనే ఈ వ్యాపారం జరుగుతోంది. ఏప్రిల్ 7 వరకూ ఉపమాకలో జాతర కొనసాగుతుంది.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి పెద్ద పీట


సీఎం రమేశ్‌తో బాపునాయుడు

అచ్యుతాపురం, మార్చి 29: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడానికి తాను ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ హామీ ఇచ్చారని పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు తెలిపారు. శుక్రవారం అనకాపల్లి వచ్చిన రమేశ్‌ని తాము ప్రత్యేకంగా కలిసి మత్స్యకారుల సమస్యలు తెలియజేశామన్నారు. జగన్ రెడ్డి పాలనలో మత్స్యకారులకు అందాల్సిన సంక్షేమ పథకాలేవీ సక్రమంగా అందడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రానున్నది మన ప్రభుత్వమేనని, తన నియోజకవర్గ పరిధిలో ఉన్న పూడిమడకపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారని బాపునాయుడు తెలిపారు.

నేడు వెన్నెలపాలెంలో టీడీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ, మార్చి 29 : మండలంలోని వెన్నెలపాలెంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి నివాసం వద్ద టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలతోపాటు మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ మాజీ సభులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి పోలింగ్ కేంద్రాల పునఃపరిశీలన

» పాయకరావుపేట ఆర్వో గీతాంజలి

నక్కపల్లి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని పాయకరావుపేట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిణి కె.గీతాంజలి చెప్పారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల పునఃపరిశీలన ప్రక్రియను శనివారం నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి, పోలింగ్ నిర్వహణకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద లైటింగ్, మంచినీరు వంటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎక్కడా రాజకీయాల్లో పాల్గొనడం లేదని, గ్రామాల్లో కోడ్ పక్కా అమలవుతుందని చెప్పారు.

ఘనంగా కొత్త అమావాస్య పూజలు

పాయకరావుపేట, మార్చి 29: పట్టణంలోని కంటోన్మెంట్ ఏరియాలో నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున అధిక సంఖ్యలో మహిళలు పొచి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమావాస్య ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గరగల సంబరాన్ని ప్రతి రోజు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు పెదిరెడ్డి వెంకటసూర్యనారాయణ, నారపురెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ రాత్రి జాతర, 8వ తేదీన కొత్త అమావాస్య పండుగ అత్యంత వేడుకగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించాలని విజ్ఞప్తి చేశారు.

'పేట'లో పోలీసులు, కేంద్ర బలగాల కవాతు


పాల్తేరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

పాయకరావుపేట, మార్చి 29: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో మండలంలోని పాల్మన్‌పేట, రాజయ్యపేట, వెంకటనగరం, రాజానగరం, రాజవరం, గజపతినగరం, అరట్లకోట, పాయకరావుపేట పట్టణంలోని మెయిన్‌రోడ్డు, దుర్గాకాలనీ, ఇందిరాకాలనీ, శెట్టిబలిజపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. పలు ప్రధాన కూడళ్లలో సీఐ అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు భయం లేకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్‌సేవ


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 29: స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్‌సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి వేదమంత్రాల మధ్య కర్రి వీరవెంకట సత్యనారాయణ, మోహన్‌లక్ష్మి లావణ్య దంపతులు, కుటుంబసభ్యులు ఊంజల్‌సేవ నిర్వహించారు. పలువురు మహిళలు ఆలపించిన భక్తిగేయాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు.

పది కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

గొలుగొండ, మార్చి 29 : పది కిలోల గంజాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఎర్రన్నపాలెం చెక్ పోస్టు వద్ద శుక్రవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై గంజాయిని తీసుకువస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన పి.పరమాన్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. గంజాయి, బైక్, రూ.నాలుగు వేలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

రంగు మారలేదు!

- కోడ్ అమలులోకి వచ్చి దాదాపు రెండు వారాలు
- ఇప్పటికీ పలుచోట్ల దర్శనమిస్తున్న వైసీపీ జెండా రంగులు
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించడం ఇదేనా అంటూ అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం



చామంతిపురంలో రంగులు మారని తాగునీటి పథకం ట్యాంకు

మాకవరపాలెం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి దాదాపుగా పదిహేను రోజులు కావస్తున్నా ఇప్పటికీ పలుచోట్ల తాగునీటి పథకాలు, జెండా దిమ్మలు,హెల్త్ సెంటర్ భవనాలకు వేసిన వైసీపీ జెండా రంగులు దర్శనమిస్తూనే ఉన్నాయి. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై పలు పార్టీల నాయకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చామంతిపురంలో తాగునీటి పథకం ట్యాం కుకు గతంలో వేసిన వైసీపీ జెండా రంగులు ఇంకా అలానే ఉన్నాయి. రాచపల్లి పోలింగ్ బూత్ సమీపంలో వైసీపీ రంగులతో జెండా దిమ్మ కనిపిస్తుండడంతో ఎన్నికల కమిషన్ నిబంధనలను అధికారులు ఇలాగేనా అమలు చేసేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జరిగే సమావేశాల్లో ఎన్నికల నియమావళిని అంతా విధిగా



రాచపల్లి పోలింగ్ బూత్‌కు వెళ్లే దారిలో ఉన్న వైసీపీ జెండా దిమ్మ

పాటించాలని పదేపదే చెప్పే అధికారుల్లో పలువురు, ఆ నిబంధనలు తమకు వర్తించవని గుర్తించడం లేదా అని మరికొందరు ఎద్దేవా చేస్తున్నారు.

బొగ్గు లారీ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి వైపు వెళుతున్న రెండు కార్లు, ఒక ఆటో, ఒక ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలు ఆగివున్నాయి. ఇదే సమయంలో గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో వేగంగా వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్పటికే సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను, ఎడమ వైపు వున్న కారును బలంగా ఢీకొన్నది. ఈ వాహనాలు.. ముందున్న మిగిలిన వాహనాలను ఢీకొన్నాయి. కారుపైకి ట్రాక్టర్ దూసుకుపోయింది. లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. డివైడర్ రెయిలింగ్ ధ్వంసం కావడంతోపాటు సెంట్రల్ లైటింగ్ స్తంభం కూలిపోయింది. ఈ ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్‌తోపాటు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.సంతోషి, కె.వెంకటరమణ, పాతగాజువాకకు చెందిన బి.శరణ్య, అగనంపూడికి చెందిన పల్లా శ్రీను జి.హర్ష, జి.కొండయ్య డి.శ్రీనివాసరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్, డి.శ్రీనివాసరాజు, కె.వెంకటరమణల పరిస్థితి ఆందోళనకరంగా వుందని పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి తొలగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పరవాడ పోలీసులు తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

... 5వ పేజీ తరువాయి

వివరాలు సేకరించానని రమేశ్ చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఎంతోమంది యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించానని, గతంలో బీజేపీ-టీడీపీ కూటమి పాలనలో జిల్లాకు కొత్తగా పలు పరిశ్రమలు వచ్చాయని, జగన్ పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆయన ఆరోపించారు. తాను స్థానికేతరుడంటూ ప్రత్యర్థి పార్టీ వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఉండి కనీసం సొంత అసెంబ్లీ నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేసుకోలేని బూడి ముత్యాలనాయుడు (వైసీపీ ఎంపీ అభ్యర్థి) వల్ల జిల్లా అభివృద్ధి చెందుతుందా, లేకపోతే తాను ఎంపీగా ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందా అనేది తనపై విమర్శలు చేసేవారు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి ఏ రోజైనా సీఎం జగన్‌ను కోరారా అని రమేశ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు ఆయన శాఖ(పంచాయతీరాజ్) ద్వారా గ్రామ పంచాయతీలకు వస్తే.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలకు మళ్లించుకున్నా బూడి ముత్యాలనాయుడు పట్టించుకోలేదని ఆరోపించారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనారిటీలు అంటూ పదేపదే చెప్పుకొనే సీఎం జగన్... వైసీపీకి చెందిన బీసీ నాయకులను విజయసాయిరెడ్డి, వైవీసుబ్బారెడ్డిలకు ఊడిగం చేసేవారిగా మార్చేశారని మండిపడ్డారు. జిల్లా అభివృద్ధిని గాలికొదిలేసిన బూడి.. ఇప్పుడు ఎంపీగా గెలిపించాలని ఓటర్లను ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు అనకాపల్లి నుంచి చోడవరం కారులో వెళితే సుమారు గంటన్నర సమయం పట్టిందన్నారు.

ఎంపీగా గెలిపిస్తే అందుబాటులో ఉంటా

అనకాపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, జిల్లా అభివృద్ధిలో భాగస్వామినవుతానని సీఎం రమేశ్ చెప్పారు. వైసీపీ పాలకులు మూసివేయించిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పిస్తానని, చెరకు పంటకు గిట్టుబాటు ధర అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానని సీఎం రమేశ్ చెప్పారు. అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా ఎస్ఈజడ్‌లను ఏర్పాటు చేయించి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే చర్యలు చేపడతానన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల ఆధునికీకరణకు కృషి చేస్తానన్నారు.

మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి సీహెచ్.అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన సీఎం జగన్.. ఇప్పుడు బస్సు యాత్ర పేరుతో జనం వద్దకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడని, పోలవరం ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో 72 శాతం పూర్తిచేయగా, వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండు శాతం పనులు కూడా జరగలేదన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులు అన్నివిధాలా మోసపోయారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి అసెంబ్లీ అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్‌రాజు, వంగలపూడి అనిత, సుందరపు విజయ్‌కుమార్, పైలా ప్రసాదరావు, , ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, రాయపురెడ్డి కృష్ణ, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో ప్రమాద ఘంటిక!

- తామరబ్బ పంచాయతీ కొండ కొడాబు శివారులో వేలాడుతున్న 11కేవీ వైర్లు
- చేతికందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు హడల్
- విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన



కొండ కొడాబు సమీపంలోని పొలంలో వేలాడుతున్న వైర్లకు కర్రను దన్నుగా ఉంచిన దృశ్యం

దేవరాపల్లి, మార్చి 29 : విద్యుత్ శాఖ నిర్లక్ష్యం అక్కడి రైతులకు శాపంగా మారింది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే వారికి పంట ఎలా పండించాలి.., పండిన పంటను ఎలా కాపాడుకోవాలి.. అనే తలంపే తప్ప మరొకటి ఉండదు. అలాంటి కష్టజీవులకు ఇప్పుడు ఓ పెద్ద కష్టమే వచ్చిందని చెప్పక తప్పదు. విద్యుత్ వైర్లు ఓ చోట నిత్యం వారిలో దడ పుట్టిస్తున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ముప్పు అన్న భయంతో బితుకు బితుకుమంటూ తమ పొలాల్లో అడుగిడాల్సి దుస్థితులు దాపురించాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. దేవరాపల్లి మండలం తామరబ్బ పంచాయతీ శివారు కొండ కొడాబు గ్రామంలోని పెద్దగరువు పొలాల్లో విద్యుత్ వైర్లు మరీదారుణంగా ఉన్నాయి. ఇక్కడ చేతికి అందేంత ఎత్తులో వేలాడుతుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు. రెండు పంచాయతీలకు సరఫరా అయ్యే 11 కేవీ విద్యుత్ వైర్లు నాగయ్యపేటకు చెందిన చలుమూరు దేముడు, రాము, బత్తి సతీష్ పొలాల్లో కిందకు వేలాడుతూ కనిపిస్తున్నారు. దీంతో వీటిని చూసినవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. ఇక్కడి పొలాల్లో రెండు చోట్ల స్తంభాలు ఓ వైపునకు వాలిపోయి ఉన్నాయి. దీంతో వైర్లు కిందివేలాడుతున్నాయి.

ఈ సమస్యను విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో పలువురు రైతులు ఎండిన కర్రను సపోర్టుగా పెట్టి వైర్లను పైకి లేపి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో చిన్నపాటి గాలి వీచినా భయంగా ఉందని వాపోతున్నారు. ఈ పొలాల్లో నిత్యం గడ్డి తవ్వడం, పంట పనులు చేస్తుండడం, గడ్డి మోపులు, పండిన పంటను ఇళ్లకు చేర్చుతుండడం వంటివి చేస్తుంటారు. అటువంటి సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి వైర్లకు తగిలినా అంతేసంగతులని అంటున్నారు. అసలు వేసవి కాలం ఆరంభమవుతుందని, ఈ సీజన్‌లో అప్పుడప్పుడు పెను గాలులతో కూడి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందని చెపుతున్నారు. అలాంటి సమయాల్లో జరగరాని ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, వైర్లను సరిచేయాల్సింది ఆ ప్రాంత రైతులంతా వేడుకుంటున్నారు.



ఓ పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పాడుగుపాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పైలా ప్రసాదరావు



మాడుగుల పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు

కె.కోటపాడు, మార్చి 29 : మండలంలోని ఎ.కోడూరు పంచాయతీ పొడుగుపాలెంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యరి పైలా ప్రసాదరావు జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ప్రవేశపెట్టనున్న పథకానలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల : టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇక్కడి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, నాయకులు పుప్పాల రమేష్, లెక్కల కాశిబాబు, సూర్యనారయణరాజు, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పది కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

గొలుగొండ, మార్చి 29 : పది కిలోల గంజాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని ఎర్రన్నపాలెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నామన్నారు. ఇంతలో బైక్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన పి.పరమాన్ అనే వ్యక్తి గంజాయిని తరలిస్తుండగా గుర్తించినట్టు చెప్పారు. గంజాయితో పాటు బైక్, పాటు, రూ.నాగులు వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇదిలావుంటే, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో డబ్బు, గంజాయి, సారా, అక్రమ మద్యం తరలింపును అడ్డుకునేందుకు ప్రత్యే నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే, చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు.

3,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



ఊట ధ్వంసం అనంతరం స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

దేవరాపల్లి, మార్చి 29 : మండలంలోని రైవాడ జలాశయం ఒడ్డున బొడ్డపాడు వద్ద నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచి మూడు వేల ఐదు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేశామన్నారు. ఈ ఘటనలో సారా తయారీకి సిద్ధం చేసిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొలుగొండ, మార్చి 29 : ఏటిగైరంపేట, గొలుగొండ సబ్ స్టేషన్ల పరిధిలోని 33కేవీ విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం ఆయా పరిధిలోని గ్రామాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారి వీడీవీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులంతా ఇందుకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ఆర్‌సీఎం చర్చి వద్ద ఏసుక్రీస్తుకు శిలువ వేస్తున్న ఘట్టం

చోడవరం, మార్చి 29 : గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఇక్కడ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గాంధీగ్రామం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో తొలుత ఏసు క్రీస్తు అనుభవించిన కష్టాలను కళ్లకు కట్టేలా ఆయా వేషధారణలతో పట్టణంలోని పలు కాలనీల మీదుగా ప్రదర్శన నిర్వహించారు. ఈ యాత్ర చివరకు చర్చి వద్ద ఏసుక్రీస్తును శిలువ వేయడంతో ముగిసింది. ఇదిలావుంటే, ఉదయం చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్లు ప్రసాద్, ఇసిడోర్ టప్పోలతో పాటు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గల పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు జరిపారు.

వడ్డాదిలో ఐదు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు



బీఎన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

బుచ్చెయ్యపేట, మార్చి 29 : వడ్డాది పంచాయతీ పరిధిలో శుక్రవారం ఐదు చోట్ల చలివేంద్రాలను ఈవో లవరాజు ప్రారంభించారు. స్థానిక కూడలి, బీఎన్ రోడ్డు, పెద్దబజారు వీధి, చిన్నబజారువీధి, కొత్తూరులలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, వాహనచోదకులు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు దాతలు ఎక్కడికక్కడ ఇటువంటి చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా కోరారు.

గ్రంథాలయంలో చేతిపంపు ఏర్పాటుకు వినతి

నాతవరం, మార్చి 29 : మండల కేంద్రం నాతవరం గ్రంథాలయం ఆవరణలో చేతి పంపును ఏర్పాటు చేయాల్సిందిగా పాఠకులు కోరుతున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం ఇరవై సెంట్ల స్థలంలో గ్రంథాలయ భవనాన్ని నిర్మించడమే కాకుండా ప్రహరీగోడ ఏర్పాటు చేశారు. ఈ ఆవరణలో అరటితో పాటు వివిధ రకాల మొక్కలు పెంచుతుండడంతో పచ్చదనం పరిడవిల్లుతోంది. ఇంత వరకు కాస్త దూర ప్రాంతం నుంచి వాచ్‌మేన్ నీటిని తెచ్చి వీటికి పోస్తున్నప్పటికీ ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో మున్ముందు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఈ తరుణంలో ఇక్కడ చేతిపంపు ఏర్పాటు చేస్తే ఇటు పాఠకులు తాగేందుకు, అటు మొక్కలకు తడిపేందుకు ఎందగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.



దూర ప్రాంతం నుంచి నీటిని తెచ్చి మొక్కలకు పోస్తున్న వాచ్‌మేన్

ఆరంభంలోనే మండుతున్న ఎండలు

- గత రెండు రోజులుగా పెరిగిన వేడి
- నర్సీపట్నంలో 38 డిగ్రీల నమోదుతో జనం బెంబేలు

నర్సీపట్నం, మార్చి 29: వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. గత రెండుమూడు రోజులుగా వేడి మరీ ఎక్కువగా ఉంటుండడంతో జనం అల్లాడుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మున్ముందు పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నంలో గత వారం రోజులుగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే, శుక్రవారం 38డిగ్రీలుగా నమోదైంది. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పట్టణంలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పనులపై బయటకు వచ్చినవారిలో కొందరు గొడుగులు వేసుకుని రాగా, మహిళలు చీరచెంగులు కప్పుకుని కనిపించారు.ఎండలు ఇప్పుడే ఇంతలా ఉంటే ఏప్రిల్, మేలో పరిస్థితి ఏమిటని జనం భయపడుతున్నారు.



ఎండ నుంచి ఉపశమనానికి చీరకొంగు కప్పుకుని వెళుతున్న మహిళలు

వేతనాల కోసం 'ఉపాధి' కూలీల ఎదురుచూపు

- ఫిబ్రవరి నుంచి చెల్లింపు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- ఎండలో చెమటోడ్చుతున్నా తమకు ఏమిటీ అవస్థలని ఆవేదన



బుచ్చెయ్యపేట, మార్చి 29 : వేతనాల కోసం ఉపాధి కూలీలు ఎదురు చూపులు చూస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ఇరవై వేల పని దినాలకు సుమారు రూ.50 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఏటా వంద రోజులపాటు పనులు చూపాలని నిబంధనలు ఉన్నా, ఇప్పటి వరకు 61 రోజులే చూపుతున్నారని అంటున్నారు. సెలవులు పోను ప్రతినెలా ఒక్కో కూలి రూ.ఏడు వేల వరకు పనులు చేస్తుంటారు. వేతనం అందగానే నిత్యావసర సరకులతో పాటు వంట గ్యాస్, విద్యుత్ బిల్లులు వంటివి చెల్లిస్తుంటారు. కొన్నిచోట్ల భార్య, భర్త కలిసి పనులకు వెళుతుంటారు. అటువంటి వారికి ఈ కూలీ డబ్బులే ఆధారం. అటువంటి వారి పరిస్థితి ప్రస్తుతం మరీ దారుణంగా ఉంది. ఈ ఏడాది మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. అయినప్పటికీ చెమటోడ్చుతున్నా ప్రభుత్వం నుంచి వారాల తరబడి వేతనాలు జమ కాకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెపుతున్నారు. గతంలో వేసవి భత్యం కింద అదనంగా కూలీ చెల్లించేవారని, గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికారని వాపోతున్నారు. ఈ సమస్యను ఏపీవో మురళీ వద్ద ప్రస్తావించగా, కూలీలు చేసి పనులకు ఎంత మొత్తం చెల్లించాలన్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమవుతుందని తెలిపారు. ఫిబ్రవరి నుంచి నేటి వరకు నగదు జమకావల్సి ఉందన్నారు.



కందిపూడి వారాధి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

బోరు తవ్వారు.. వదలేశారు..!

- పంచాయతీ అధికారుల తీరుపై వెంకయ్యపాలెం వాసుల ఆగ్రహం



గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బోరు

మాకవరపాలెం,మార్చి 29 : వెంకయ్యపాలెంలో బోరు తవ్వి నిరుపయోగంగా వదిలేయడంతో అక్కడివారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామన్నపాలెం పంచాయతీ శివారున గల ఈ గ్రామంలో సుమారు ఎనభై కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఇది ఎగువ ప్రాంత్రం కావడంతో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడున్న రెండు బోర్ల నుంచి తాగునీరు అరకొరగా వస్తుండడంతో స్థానికులు పలుమార్లు మొరపెట్టుకోవడంతో పంచాయతీ ద్వారా ఎట్టకేలకు తాగునీటి బోరు వేయించారు. అయితే దీనికి హెడ్ బిగించకపోవడంతో నిరుపయోగంగా మారింది.



లంకెలపాలెం సమీపంలోని ఈ-మర్రిపాలెం కూడలి వద్ద సీఎం రమేశ్‌కు గజమాల వేస్తున్న జనసేన శ్రేణులు



అనకాపల్లి పట్టణంలో జరిగిన సమావేశానికి హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకం



అనకాపల్లి సభలో సీఎం రమేశ్‌ను ఆలింగనం చేసుకున్న టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో కొణతాల రామకృష్ణ, పీలా గోవింద

క్రైం... crime news

గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న 13 మంది అరెస్టు

» రూ. 37,130 నగదు స్వాధీనం

సబ్బవరం, మార్చి 29 : మండలంలోని పలు ప్రాంతాల్లో గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న 13 మందిని దాడి పట్టుకున్నామని, వారి వద్ద నుంచి రూ.37,130 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలునాయుడుపాలెం శివార్లలో లూడో ఆన్‌గేమ్ ఆడుతున్న సమాచారం మేరకు గురువారం రాత్రి దాడి చేసి ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.అదేవిధంగా అమృతపురం సమీపంలో శుక్రవారం గుళ్లాట ఆడుతున్న వారిపై దాడి నలుగురుని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.14 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎ. సిరసపల్లి శివార్లలో పేకాట(కోత ఆట) ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 10 వేలు నగదు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరెస్టు చేసిన 13 మంది అనకాపల్లి కోర్టుకు తరలించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

శిరిజాంలో అగ్నిప్రమాదం

» 13 పశువుల పాకలు ,15 ధాన్యం గడ్డిమేట్లు దగ్ధం

» రూ.15 లక్షల వరకూ ఆస్తినష్టం



ప్రమాదంలో దగ్ధమైన పశువుల పాకలు, ధాన్యాన్ని భద్రపర్చే గడ్డిమేట్లు

చీడికాడ, మార్చి 29 : మండలంలోని శిరిజాం గ్రామం గుంపానవారి పశువులపాకల వద్ద శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం జరిగినట్టు బాధితులు వాపోతున్నారు. ఉదయం తొమ్మిదిన్న గంటల సమయంలో రైతులు పొలం పనులకు వెళ్లిన తరువాత విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుంపాన లక్ష్మణ పశువుల పాకల వద్ద మంటలు చెలరేగాయి. వీటిని అక్కడివారు గుర్తించి సంబంధిత రైతులకు తెలపడంతో వారు వచ్చారు. అప్పటికే పశువులపాకలు, గడ్డిమేట్లు దగ్ధమవుతున్నాయి. ఈ ఘటనలో పదిహేను కుటుంబాలకు చెందిన 13 పశువులపాకలు, 15 ధాన్యం భద్రపర్చే గడ్డిమేట్లు దగ్ధమయ్యాయి. మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి అప్పటికి ఉన్న మంటలను ఆర్పారు. ఇదిలావుంటే, గడ్డిమేట్లలో నిల్వచేసుకున్న తిండిగింజలు, ఎన్నో ఏళ్లుగా ఉన్న చింతచెట్లు కాలిపోయాయని బాధిత రైతులు వాపోతున్నారు. వీఆర్‌వో కోడూరు శేఖరరావు నష్టం వివరాలను సేకరించారు. టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పైలా ప్రసాదరావు, ఈర్లె అనూరాధలతో పాటు గొల్లవిల్లి రాజబాబు, పుట్టా రామ్‌కుమార్, రెడ్డి సన్యాసినాయుడు, పంచాడ దాలెంనాయుడు తదితర నాయకులు బాధితులను పరామర్శించారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 29 : పట్టణంలో కొనుగోలు చేసి 25 మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. కశింకోట మండలం చెరకాం గ్రామానికి చెందిన గులిమి సంతోష్ మద్యం షాపులో 15 బాటిళ్లు కొనుగోలు చేసి సంచిలో పెట్టుకుని వెళుతుండగా రింగురోడ్డులో పట్టుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఎలమంచిలి మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన అనసూరి సన్యాసిరావు పది మద్యం బాటిళ్లతో వెళుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

» ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మార్చి 29: మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని, వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ ప్రమాదంలో విశాఖపట్నంకు చెందిన మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందగా, విశాఖకు చెందిన బీవీఎస్.కృష్ణ, కె.దీరకుమార్‌లకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. పులపర్తి జంక్షన్ సమీపంలో తుని నుంచి విశాఖ వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ టీ తాగేందుకు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే సమయంలో భీమవరం నుంచి విశాఖ వైపు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిలో కారు డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శివకుమార్ ఆస్పత్రిలో మృతి చెందగా.. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు విశాఖలోని వైభవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని, కార్యాలయ పని మీద భీమవరం వెళ్లి తిరిగి విశాఖ వస్తుండగా ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, మార్చి 29 : బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భీమరాజు శుక్రవారం తెలిపారు. మండలంలోని దుగ్గాడ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నాతవరం మండలం గునిపూడికి చెందిన పోలిపల్లి సాయి తనపై అత్యాచారానికి యత్నించినట్టు బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, విచారణ అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, మార్చి 29 : మండలంలోని అచ్చెర్ల గ్రామానికి 9 మద్యం బాటిళ్లు తీసుకువస్తున్న వెలగా మాణిక్యంను పట్టుకున్నట్టు ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం గ్రామంలో తనిఖీ నిర్వహిస్తుండగా గోనె సంచిలో తీసుకెళుతున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోదీ మరొకసారి అధికారం చేట్టడం తథ్యం

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీంఎం రమేశ్



సింహాచలంలో తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న సీఎం రమేశ్

సింహాచలం, మార్చి 29: కేంద్రంలో మరొకసారి నరేంద్రమోదీ నాయకత్వం లోని భాజపా ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆయన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ జరుగుతున్న సుదర్శన నారసింహ యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ అప్పన్నకు కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు చూపుతున్న అభిమానం చూస్తుంటే అనకాపల్లి స్థానం నుంచి తన విజయంతో పాటు కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో భాజపా ప్రభుత్వం మరోసారి పగ్గాలు చేపట్టడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఆయన వెంట నగర భాజపా అధ్యక్షులు మేడపాటి నరేంద్ర పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

కాలుష్యంతో పర్యావరణానికి పెనుముప్పు

» పారిశుధ్య సమస్యతో ప్రజల అవస్థలు

» మృత్యువాత పడుతున్న మూగజీవాలు

» కాగితాలకే పరిమితమైన నిషేధం అమలు



మండలంలో వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, సంచులు.

సబ్బవరం, మార్చి 29:

పర్యావరణానికి పెను ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలంతా అవస్థలు పడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధమున్నా ప్రజల్లో అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కాలుష్యానికి కారణ బూతాలవుతున్నాయి.

ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో మాత్రమే పాలిథిన్ సంచుల వినియోగం ఉండేది. ప్రస్తుతం మారుమూల చిన్న పల్లెల్లో కూడా వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. మండలంలోని 24 పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి కార్యక్రమానికి ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లలో సామగ్రి వినియోగించడం ప్రజలకు వ్యసనంలా మారిపోయింది. సబ్బవరం మేజరు పంచాయతీలోనూ నిత్యం లెక్కలేనంతగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. రోడ్ల పక్కన, షాపులు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.



అమలు కాని ప్లాస్టిక్ నిషేధ చట్టం

పర్యావరణానికి ముప్పు తెచ్చే 40 మైక్రాన్‌ల కంటే తక్కువ దళసరి ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం 2011లో పూర్తిగా నియంత్రించింది. నిషేధం అమల్లోకి వచ్చి 8 ఏళ్లు గడుస్తున్నా... కనీస స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగం తగ్గకపోగా, నానాటికీ పెరిగిపోతూనే ఉంది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. నిత్యావసర సరుకులు చేరవేత నుంచి ఆహారం ప్యాకింగ్ వరకు ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. విందు, వినోదాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకం అలవాటుగా మారిపోయింది. వినియోగించిన ప్లాస్టిక్ సంచులను డంపింగ్ యార్డులకు తరలించినా, అవి కుప్పలుగా పేరుపోతున్నాయే తప్ప భూమిలో కలిసే పరిస్థితి లేదు. డ్రైనేజీలు, పంట కాలువలు ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, ఇతర మూగ జీవాలు తినేస్తుండడంతో అవి కూడా మరణించే పరిస్థితి దాపురించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగించే విషయం. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు పాలిథిన్ వాడకంపై కఠిన నిర్ణయాలు తీసుకొని, నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళి అమలెక్కడ?

» జీపీ అగ్రహారంలో నీటి పథకంపై తొలగించని జగన్, మోదీ చిత్రాలు

» పట్టించుకోని అధికారులు



నీటి పథకంపై తొలగించని జగన్, మోదీ చిత్రాలు

అచ్యుతాపురం, మార్చి 29: మండలంలోని నునపర్తి పంచాయతీ జీపీ అగ్రహారంలో అధికారులు ఎన్నికల నియమావళి అమలు కాలేదు. అక్కడ సోలార్ పవర్‌తో నిర్మించిన నీటి పథకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఫొటోలు ఉన్న బోర్డును తొలగించలేదు. కనీసం పేపర్లు కూడా అంటించలేదు. అలాగే సమగ్ర భూసర్వే హద్దురాళ్లపై వైఎస్సార్ జగనన్న భూరక్ష అన్న వాటిని తొలగించలేదు.

ఇక.. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే జెడ్‌పీ అతిథిగృహం శిలాఫలకంపై తూతూ మంత్రంగా కాగితాలు అంటించారు.

అవి ఊడిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.



ఎయిర్‌పోర్టులో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు సభ్యులు రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, కేఎల్ రాహుల్



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ సౌరవ్ గంగూలీ, జట్టు సభ్యులు కుల్దీప్ యాదవ్, ఇషాంత్ శర్మ, డేవిడ్ వార్నర్

విశాఖ చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు

» ఇరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రేపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 29: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 31న జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లో పాల్గొనే చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల ఆటగాళ్లు శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. శుక్రవారం నగరానికి చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్లలో ఎంఎస్ ధోనీతోపాటు రుతురాజ్ గైక్వాడ్, రహానే, షేక్ రషీద్, సమీర్ రిజ్వీ, రవీంద్ర జడేజా, మిశ్చల్, శివం దుబే, అవినాష్ రావు, రాజవర్దన్, దీపక్ చాహర్, ప్రశాంత్ సోలంకి, నిశాంత్ సింధు, రచిన్ రవీంద్ర, శార్దూల్ ఠాకూర్, దుషార్ దేశ్ పాండే, తదితరులు ఉన్నారు. విమానాశ్రయం నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లేందుకు సీఎస్‌కే ఆటగాళ్లు బస్సు ఎక్కుతున్న సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. ధోనీ..ధోనీ అని నినాదాలు చేశారు. కాగా, ఇప్పటివరకు జరిగిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి మూడో మ్యాచ్‌లో పాల్గొనేందుకు విశాఖ చేరిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా మహేంద్రసింగ్ ధోనీ అభిమానులు మ్యాచ్‌పై ఆసక్తిగా ఉన్నారు.

తిరిగి నగరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్

గురువారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు తిరిగి శుక్రవారం హోమ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు... అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం సాయంత్రం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

భీమిలిపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

నెల్లిమర్ల పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పేర్లను తొలుత పరిశీలించింది. ఆ తరువాత బైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి పేరును కూడా జాబితాలో చేర్చింది. ఈ ముగ్గురిలో ఒకరికి భీమిలి టిక్కెట్ ఇవ్వాలని భావించింది. అయితే గంటా శ్రీనివాసరావు చివరి వరకు చేసిన ప్రయత్నాలు, భీమిలిలో సీనియర్ నాయకులే బరిలో ఉండాలని పార్టీ అధినేత భావించడంతో గంటా పేరునే ఖరారు చేశారు. తనకు టికెట్ కేటాయించినందుకు చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గంటా పేరును ప్రకటించగానే భీమిలిలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తంచేశాయి. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు.

ఒకసారి ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు

గంటా శ్రీనివాసరావు 1999లో రాజకీయ అరంగేట్రం చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన ఐదు ఎన్నికల్లో పోటీ చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి ఎంపీగా గెలిచిన తరువాత 2004 ఎన్నికల్లో చోడవరం నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల సమయంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించగా ఆ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సీనియర్ నాయకులైన దాడి వీరభద్రరావు (టీడీపీ), కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)లపై గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున భీమిలి నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కర్రి సీతారామ్‌పై 37 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు. గత 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బరిలో దిగి వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై పైచేయి సాధించి ఎమ్మెల్యే అయ్యారు. రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మౌలిక వసతుల శాఖ మంత్రిగా, 2019లో చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఏనాడు కూడా ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీ చేయలేదు. అయితే తన రికార్డును తానే బ్రేక్ చేసుకొని ఈసారి భీమిలి నుంచి పోటీ చేయబోతున్నారు.

కారు ఢీకొన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కె.కోటపాడు, మార్చి 29 : కారు ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. చౌడువాడ గ్రామానికి చెందిన ఆళ్ల నూకరాజు (35) గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తన పొలంలోకి నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో అతివేగంగా వెళుతూ నూకరాజును ఢీకొన్నారన్నారు.

అనంతరం కారు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని రోడ్డు నుంచి కిందకి బోల్తా పడి నుజ్జయిందన్నారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతిచెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

అనకాపల్లి టౌన్, మార్చి 29: రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్న గవరపాలెంలోని 22వ వార్డు సచివాలయ వలంటీర్ కె.శివకృష్ణను విధుల నుంచి తొలగించినట్టు జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు శుక్రవారం తెలిపారు. ఈనెల 26వ తేదీన నూకాంబిక ఆలయ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైసీపీ సమావేశానికి వలంటీర్ శివకృష్ణ హాజరైనట్టు అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారికి ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు శివకృష్ణను విధుల నుంచి తొలగించినట్టు ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ విస్తృతంగా చేపట్టాలి

ఎస్పీ కేవీ మురళీకృష్ణ



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సలహాలు, సూచనలు చేస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

పరవాడ, మార్చి 29: ఎన్నికల నేపథ్యంలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సిబ్బందికి సూచించారు. దేశపాత్రునిపాలెం వద్ద గల చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా వాహన తనిఖీలు చేయడం తోపాటు డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే ఉచిత కానుకల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

మాక్ కౌంటింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



మాక్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి

అనకాపల్లి టౌన్, మార్చి 29: జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద గల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న మాక్ కౌంటింగ్‌ను పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్ల నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. చిన్న తప్పునకు అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సీఎం రమేశ్ దంపతులు

» సత్కరించిన దాడి రత్నాకర్, జయవీర్



సీఎం రమేష్ దంపతులను సత్కరిస్తున్న దాడి రత్నాకర్, జయవీర్

అనకాపల్లి టౌన్, మార్చి 29 : స్థానిక నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో శుక్రవారం రాత్రి బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ శ్రీదేవి దంపతులు, కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి జయవీర్ సాదర స్వాగతం పలికారు. దగ్గరుండి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం సీఎం రమేశ్ దంపతులకు గజమాల వేసి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ అర్చకులు సీఎం రమేష్ కుటుంబసభ్యులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం

» భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



వాహనం పైనుంచి మాట్లాడుతున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

లంకెలపాలెం, మార్చి 29: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు శుక్రవారం లంకెలపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ముఖ్య నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత, పీలా గోవింద సత్యనారాయణ, పైలా ప్రసాదరావు, గవిరెడ్డి రామానాయుడు, సుందరపు విజయ్‌కుమార్, బుద్ధ నాగజగదీశ్, పీఎస్ మాధవ్, ప్రగడ నాగేశ్వరరావు క్రేన్ సాయంతో సీఎం రమేశ్‌కు గజమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. తనకు స్వాగతం పలికేందుకు భారీగా తరలి వచ్చిన కూటమి పార్టీల శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభివాదం చేస్తూ అక్కడి నుంచి ర్యాలీగా అనకాపల్లి బయలుదేరారు. అంతకుముందు జిల్లా ముఖ ద్వారం ఈ-మర్రిపాలెం కూడలి వద్ద జనసేన శ్రేణులు సీఎం రమేశ్‌కు గజమాలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో నేతలు దుల్ల రామునాయుడు, కరణం నరసింగరావు, రెడ్డి నగేశ్, మోటూరి సన్యాసినాయుడు, సోమశేఖర్, సర్వసిద్ధి సన్యాసిరాజు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. కాగా, జనసేన సైనికులు భారీగా తరలి రావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి.